నవలా - చిన్నకథ

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

ఈ నాటి నవలకూ, చిన్న కథకూ పూర్వ స్వరూపాలు ఇతి హాసము, ఉపాఖ్యానమును. అప్పట్లో వీటికి రెండు ఆశయాలుండేవి. (1) చరిత్రను సజీవంగా ఉంచటం, (2) జీవితం గురించి (Objective) గా రచించటం.

(Subjective, Objective) అనే దృష్టిపథాలను గురించి కొంత తెలుసుకోవాలి. జంతువుల జీవితాలు Subjective గా అంటే వాటి భావాలు కష్టసుఖాలతో లగ్నమై ఉంటై. నిర్లిప్తత ఏర్పడితే తప్ప జీవితాన్ని గురించి శాస్త్రీయంగా ఆలోచించి సంస్కారం పొందే శక్తి రాదు. సంస్కారం పెరిగిన కొద్దీ ఈ నిర్లిప్తత కూడా హెచ్చవుతుంది. నిర్లిప్తత అంటే నిర్లక్ష్యం అనుకోరాదు. నిర్లిప్తత వెంట నిర్లక్ష్యంకూడా ఉంటే వేదాంతం పుట్టుకొస్తుంది. మనకు కావలిసింది వేదాంతం కాదు, సంస్కారం.

ఉదాహరణకు పామును తీసుకోండి పాము మనకు భయం ప్రేరేపిస్తుంది. ఈ భయం మనల్ని ఆవేశించినంతకాలమూ పాము మనకు తెచ్చిపెట్టే సమస్యల్ని పరిష్కరించలేం. పాముకాటుకు విరుగుడు కనిపెట్టాలంటే పాముయెడల ఉండే భయాన్ని దాటి పామును పట్టుకుని విషంపిండి దాని విరుగుళ్లు అన్వేషించే శక్తి రావాలి. జీవితం తాలూకు సమస్యలకు పరిష్కారమార్గాలన్వేషించేవారందరూ సమస్యలను మించి పెరిగిన సంస్కారం కలవారే గాని సమస్యలతో బాధపడుతూ దానిలో లగ్నమై ఉండేవారా పనిచెయ్యలేరు.

జీవితంలో లగ్నమైన సంస్కారంలేని జీవులు కష్టసుఖాలు మటుకే గుర్తిస్తారు కాని (Objective)గా జీవితాన్ని చూసే సంస్కారి ఆనందం పరమావధిగా పెట్టుకుంటాడు. నిర్లిప్తత ద్వారా ఆనందమనేది కష్టసుఖాలు రెంటినుంచీ ఉత్పన్నమవుతుంది. జాతీయ వీరుడు జైలుకుపోయో, దెబ్బలుతినో, ప్రాణాలర్పిస్తూనో ఆనందం పొందగలుగుతాడు. సుఖంలో నుంచి మటుకే ఆనందం పుట్టుతుందనుకోరాదు. కళల ద్వారా ఉత్పన్నమయే సంస్కారానికి ఈ ఆనందమే పరమావధి.

మనిషి బుద్ధిని జీవితం నుంచి విడదీసి నిర్లిప్తత చేకూర్చేటందుకు మానవుడు చేసిన తొలి సాంస్కారిక ప్రయత్నాల ఫలితంగా భగవంతుడు, విధీ వచ్చాయి. మనిషికి కలిగే కష్టసుఖాలన్నిటికీ ఒక బాహ్యకారణం ఉందనే విశ్వాసం ఏర్పడగానే మానవుడి దృష్టి కష్టసుఖాలను దాటి పై కారణంకేసి మళ్ళింది, పిల్లవాడు ఏ పీటో తగిలి

ఏడుస్తుంటే మనం వాడి మనస్సును బాధనుంచి మరల్చటానికి పీటను కొప్ప డతాం. కొడతాం. దాంతో పిల్లవా డేడుపుమాని పీటను గురించి ఆలోచి స్తాడు.

భగవంతుడూ, విధీ మనసులో ఉంచుకుని అవే బాహ్యాకారణాలుగా నిరూపించి రాసిన కథల్లో భగవంతుడు గాని, అతని అవతారంగాని ప్రధాన పాత్ర ధరించింది. ఈ ప్రయత్నంలో చరిత్రగా ఉండవలసిన ఇతిహాసాలు వక్రస్వరూపం పొందినాయి. కాని అప్పట్లో అదే సంస్కారసాధనంగా ఉండింది.

కాని రాను రాను భగవంతుడు, విధి అనేవి-సత్యకారణాలు కానికారణం చేత-సంస్కారాన్ని విశేషం ముందుకు పట్టుకు వెళ్ళలేకపోయినాయి. అంతా విధేననే నెపంమీద ఏ దుర్మార్గమైనా సహించ వలసినస్థితి ఏర్పడింది. ఈ స్థితిలో సంస్కారానికి మరో ఆధారం దొరికింది. అది నీతి. మనిషియొక్క కోరికలు చైతన్యానికిదారితీస్తూ ఉండడం చేత-వాటిద్వారా మానవబుద్ధి జీవితంలో లగ్నమైపోతూ ఉండటంచేత - కోరిక లను (objective) గా, నిర్లిప్తంగా చూసుకోగలందులకు నైతికదృష్టి కథా సాహిత్యంద్వారా ప్రచారం చెయ్యటం జరిగింది. దీనికి ఫలితంగా పంచ తంత్రం కథలేగాక, ఈసప్ కథలు మొదలైనవి అనేకం పుట్టుకొచ్చినై.

ఈపరిణామంలో ఆఖరుదశ ఇటీ వలనే దాదాపు మన కళ్ళఎదటనే కలి గింది. సంఘాన్నిగురించీ, ఆర్థికాలను గురించీ, మానవ మనస్తత్వంగురించి జరిగిన శాస్త్రీయమైన పరిశోధనల మూలంగా సాంఘికజీవితంలోనూ,వ్యక్తి జీవితంలోనూ కలిగే ప్రతిమార్పునూ మనం అర్థంచేసుకుని ఆ మార్పును నిర్ణ యించేశక్తి మానవుడికి అందుబాట యింది. అందుచేత కథా సాహిత్యం శాస్త్రజ్ఞానాన్ని నిర్లిప్తతాసాధనంగా పెట్టు కుని యదార్థ జీవితాన్ని ప్రతిబింబించ టానికి పూనుకుంది. ఇది ఆఖరు పరి ణామం. ఈ విధానమే పోనుపోను మరింత సమగ్రం కావచ్చు, ఉత్తమ కథలు రావచ్చుగాని, ఇక మరోమార్పు వచ్చి సాహిత్యం నిర్లిప్తతకోసం కొత్త మార్గాలు తొక్కే అవకాశంలేదు.

ఈనాడు మనకు నీతికథలు అన ర్థంగా కనిపిస్తాయి. ఉదాహరణకు చూడండి. పరశురాముడనేవాణ్ణి అతని తండ్రి "నీతల్లిని వధించు" అని శాసిం చాడు. పరశురాముడు ముందువెనక లాలోచించకుండా తల్లిమెడ నరికేశాడు. తండ్రిమాట తక్షణంపాలించిన పరశు రాముడికథలో ఒకనీతి మనంచూస్తాం. చిరకారి అని మరొకడున్నాడు. అతణ్ణి కూడా తండ్రి తల్లిని చంపమని ఆజ్ఞా పించి అరణ్యానికిపోతాడు. కాని చిర కారి పరశురాముడల్లే తల్లిని చంపక తండ్రికోపంలో అన్నమాట పాటించ టానికి సందేహిస్తాడు. ఇంతలో తండ్రి తనకోపం చల్లారి తిరిగివచ్చి కొడుకు నిదానానికి సంతోషిస్తాడు. ఈరెండూ నీతికథలే. నీతికథల ఉద్దేశం నిజంగా ప్రవర్తన ఉపదేశించటమే అయితే ఈ రెంటిలో ఏదోఒకటి తప్పయిఉండాలి.

కాని వాటి ఉద్దేశం అదికాదు. ప్రవర్త నను గురించి నిర్లిప్తంగా - మరోదృష్టి నుంచి - ఆలోచించేటందుకు ప్రేరేపించ టమే. ఈనాడు పార్యపుస్తకాలలోపెట్టే నీతికధలు చూస్తే అందులో కొన్ని హాస్యాస్పదంగా ఉంటాయి. దానికి కారణం మన ఈనాటి సంస్కారం శాస్త్ర విజ్ఞానంతో కూడుకున్నది కావ టమే.

కథా రచనలో విషయమూ, విధా నమూ అని రెండున్నాయి. వెనకటి వారికి విషయంగురించి బాధ ఉండేది కాదు. ఉపనిషత్తుల్లో భావాలూ, పురా ణాల్లో గాధలూ తీసుకుని అవే మళ్లా మళ్లా రాస్తూ శిల్పాన్ని పదునుపెట్టు కుంటూ, ఒకరినిమించి ఒకరు రాయా లని ప్రయత్నిస్తూ వచ్చారు. దీనివల్ల శిల్పంమెరుగు తేలిందిగాని దానికి ప్రాధా న్యతకూడా ఏర్పడింది క్రమంగా సాహిత్యం జీవితానికి ఎడంగా కూడా పోయింది విషయదారిద్ర్యంవల్ల.

కాని ఇప్పుడు అభ్యుదయ సాహి త్యంలో యధార్ధ జీవితాన్ని ప్రతిష్టించాం కనక, మనకు తాత్కాలికంగా విషయ ప్రాధాన్యత ఏర్పడింది. విషయం గురించి చర్చలేకుండా పోయిన తరువాత కళాసృష్టిలో విధానానికితగిన ప్రాముఖ్యం ఏర్పడక తప్పదు. యధార్ధ జీవితాన్ని గురించి రాయటమే పరమాదర్శంకాదు. దాన్ని గురించి నిర్లిప్తమైన. సంస్కా రికమైన దృష్టి ప్రజాసామాన్యంలో వ్యాప్తంకావాలి. అది ఈనాడులేదు. పాపం అనేదాన్ని తీసుకోండి. పాపం సాంఘికవ్యవస్థ నంటిపెట్టుకొని ఉంది. వ్యక్తులు పాపాన్ని ఎంత పోగొట్టుకోవ డానికి చూసినా, పాపులను మనం ఎంత కాలం శిక్షించినా సాంఘికవ్యవస్థ నంటి పెట్టుకున్న పాపంనుంచి పాపులు పుట్టు తూనే ఉంటారు. పాములను చంపటం అవసరంకావచ్చుగాక కాని పాము విషా నికి విరుగుడు కనిపెట్టడం సంస్కార దృష్టిలో ఇంకా ముఖ్యమైనది. జీవి తాన్ని గురించిన నిర్లిప్తమైన సంస్కారిక దృష్టిపెరిగినకొద్దీ, జనసామాన్యం జీవిత సమస్యలతో సరిగా పోరాడగల్గుతుంది.

ఇక శిల్పవిషయం. ఒకే పుస్తకాన్ని పదిమంది చదివి పదిమందీ ఒకే రక మైన ఆనందం పొందరు. అందుచేత అందరు వ్యక్తులకూ అనందం ఇచ్చే శిల్పాన్ని నిర్ణయించటం సాధ్యంకాదు. కాని ఒక వర్గానికిమట్టుకే ఇంపుగాఉండే శిల్పాన్ని నిర్ణయించడం ఇంతకంటె తేలికైనపని. అచ్చగా జమీందార్లనే రుచించేటట్టు శిల్పం నిర్ణయించవచ్చు.

శిల్పమనేది సహజంగా మన అందరి లోనూఉంది. ఏడిచే పిల్లవాణ్ణి నవ్వించ వచ్చు మభ్యపెట్టి. అయితే సాహిత్య కళకి చెందిన శిల్పంయొక్క ఆశయం ప్రజలను మభ్యపెట్టడంకాదు. వారి దృష్టిని జీవిత కష్టసుఖాల దగ్గర్నుంచి మరల్చి వాటి వెనకఉండే కారణాల మీదికి మరల్చటం. ఆ కారణాలను ఎట్లా సంస్కరించుకునేదీ ప్రజలే నిర్ణ యించుకుంటారు. శిల్పం అసమర్థంగా ఉంటే బుద్ధి విషయంమీదనుంచి విము ఖము అవుతుంది. అందుచేత శిల్పం యొక్క ఆశయం విముఖుల్ని కూడా విషయోన్ముఖులు చెయ్యటం.

శిల్పికి మానవ మనస్తత్వం తెలిసి ఉండటం అవసరం, నటుడయినా, కథకుడయినా. ఏ కళాకారుడైనా మానవ మనస్తత్వం అవగాహన చేసుకోకుండా ప్రేక్షకుల నాకర్షించలేడు. మనకు ప్రత్యక్షానుభవంలేని జీవితఘట్టాలలో కూడా మన బుద్ధిని లగ్నం చెయ్యాలంటే కళాకారుడు మనస్తత్వాన్ని ఎంత బాగా గ్రహించగలవాడై ఉండాలో ఊహించవచ్చు.

మరో ముఖ్యవిషయమేమంటే రచయిత తన అనుభవాన్ని దాటిపోరాదు. తనకు సమగ్రంగా తెలిసిన జీవితభాగం అవగాహన చేసుకుని అందులోని సత్యాన్ని ప్రకటించనంతసేపూ రచయిత మధ్యతరగతివాడయినా, జమీందారయినా కూడా అభ్యుదయ సాహిత్యము రాయగలడు. ప్రజాజీవితానికి ఎంతో ఎడంగా ఉన్న రచయిత కూడా ప్రజలకు సన్నిహితుడు కావటానికి సరియయినమార్గం ఇదే.

రచయితకూ అతనురాసే జీవితానికీ ఉండదగిన సంబంధం ఏమిటంటే ఆ జీవితంకంటె ఆ రచయిత సన్నిహితంగా ఉండికూడా కొద్దిగా పైగాఉండి దాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోగలవాడైఉంటేనే ఉత్తమ సాహిత్యం పుట్టుతుంది. కొందరు కథకులు అత్యాసకుపోయి తమకు ఒకమెట్టు పైన ఉన్న జీవితాన్ని చిత్రించబోతారు కొందరు రచయితలు నెలకో మూడొందలు సంపాదించే పాత్రను సృష్టించి కూడా సరిగా నిర్వహించలేకపోతారు. తనను ఆకర్షించే జీవితాన్నిమట్టుకే రాసే రచయిత విఫలుడై తీరుతాడు. తనకు కొంచెం కిందుగాఉన్న జీవితం గురించి రాసినప్పుడే రచయిత సంపూర్ణసంస్కారం ప్రకటించగలడు. ఆమాటఅని మరీ కిందుగాఉన్న జీవితాన్ని తీసుకున్నట్టయితే రచయితయొక్క నిర్లిప్తత నిర్లక్ష్యంగా మారి వేదాంతం చెప్పే అవకాశం ఉంది.

కథాశిల్పంలో సూత్రప్రాయంగా గమనించవలసిన అంశమేమంటే, కథఅంతా చెప్పాలి కథతప్ప మరేమీ చెప్పకూడదు కథలో ఏకత్వం (Ooganic unity) పరిపూర్ణత్వమూ ఉండాలి.

కథాశిల్పానికి సంబంధించిన ఇతర సూత్రాలేమంటే, పరితల రసగ్రహణశక్తిలో కొంత విశ్వాసం ఉంచాలి. ప్రతి స్వల్పవిషయాన్ని అంతులేకుండా వ్యాఖ్యానంచేసి కథ చెప్పటమంటే బుట్టలో ఏకులు కుక్కటంలాగా చెయ్యకూడదు, చదివేవాడు ఒక్క ముక్కలో తెలుసుకునే విషయాన్ని పదివాక్యాలలో వ్యాఖ్యానిస్తే చదివేవాడి ఆసక్తి ఎటో పోతుంది. వెనుకటికథలు శిల్పంలోపించిన కారణంచేత పూర్వకథలు దీర్ఘంగా ఉండేవి. సమయనిరూపణకు మూడు పేరాల వర్ణనా, స్థలనిరూపణకు మరో మూడు పేరాలూ, పాత్రను ప్రవేశపెట్టడానికి మరో కొంతస్థలమూ వినియోగపరిచేవారు. ఈనాటికథలు చాలా సంగ్రహంగా ఉంటాయి. కథనానికి అవసరంలేని వివరాలుండవు.

కార్డుకథలు చూసినట్టయితే పాత్రలను పరిచయంచేసి ఒక సంఘటనచెప్పి ఆ సంఘటనకు ఒక మొన ఏర్పరచటం

అతి కొద్దిలోగా అయిపోతుంది. కార్డు కథలు శిల్పంలో మంచి శిక్షణ ఇస్తాయి. కాని వాటిద్వారా ఉత్తమ సాహిత్యం రావటం అనుమానాస్పదం. కార్డుకథలు బాగా రాయటం సులభంకాదు.

కథ సంఘటనను అరిటిపండువొలిచి నట్టు వొలిచిపెట్టాలా. లేక చదివేవాడి ఆలోచనకేసి వదలాలా అంటే నాఅభి ప్రాయం ఆలోచనరేపి వదలాలనే. సరి అయిన సాహిత్యం చదివేవారి భావా లను ఒకమార్గంగా నడపాలి గాని ఒక గమ్యస్థానం చేర్చి వదలరాదు అట్లా ఒక సందేశం ఇచ్చి వదలినట్లయితే సాహిత్యం పరమార్థమైపోయి, అది మహో చైతన్యానికి దారితీయదు. కథలో ఉండే సంఘటన అసమగ్రంగా ఉండా లనికాదు. కాని దానిమీద కథకుడు తీర్పు చెప్పరాదు కథ చదివినాక చదివినవాడి తలలో భావాలు సలుముకొలు పోయినా కూడా శిల్పంలో లోపంఉన్నట్టే.

ఒకేసంఘటనను చిత్రించేది చిన్న కథ, ఒక జీవితభాగాన్ని చిత్రించేది నవల. కథకు వాతావరణం, పాత్రల మనస్తత్వం. నవలకు వాతావరణం సంఘం. లాటరీలో ఒకలక్షరూపాయలు రావటంలాటి మారుమూలసంఘటనలను కూడా సరిఅయిన మనస్తత్వ వాతావర ణంతో చిత్రించవచ్చు. కాని నవలలో యథార్థ జీవిత వాతావరణం వొదిలేసి మారుమూల సంఘటనల పరంపర చిత్రించడం సాధ్యం కాదు. నవల పాత్ర జీవితంద్వారా కొంత వరకు సంఘ జీవితం కూడా చిత్రించక తప్పదు. నవలలో పాత్రలు పరిణామం చెందుతాయి చిన్నకథల తాలూకు సంఘటనలు పాత్రల పరిణామానికి ఎంత ప్రబలమైన అవకాశం ఇచ్చినా ఆ పరిణామాన్ని చిత్రించటం చిన్నకథ ఆశయం కాదు.

రచన అనేది తదేక దీక్షతో చేసి నప్పుడే ఉత్తమ సాహిత్యం వెలువడు తుంది. రచయిత పొట్టపోసుకునేం దుకు ఇతర వ్యాపారాలలో నిమగ్నుడై ఉంటే ఉత్తమ సాహిత్యం సృష్టి కాదు. ఈనాటి సంఘంలో రచనద్వారా పొట్ట పోసుకునే అపూర్వ అవకాశం దొరికిన వానికి ప్రజాజీవితం ఎడమవుతూ ఉంది. ప్రజా జీవితం సన్నిహితంగా ఉండి రచనద్వారా పొట్టపోసుకునే అవకాశాలు గలవారికి మంచి సాహిత్యం సృష్టించే అవకాశం కూడా ఉంటుంది.

కథారచనలు చెయ్యదలచినవారు విరివిగా కథా "సాహిత్యం చదవాలి. మొదట్లో అన్ని కథలూ బాగున్నట్టే కనిపించినా, రాను రాను వాటిలో మంచి చెడ్డలూ, గుణలోపాలూ కనిపిస్తాయి. శిల్పంకూడా పరిచయంవల్ల లభ్యమవు తుంది.